క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం

సోమల: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ శ్రీరాములు ఆదేశించారు. శనివారం మండలంలోని పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మిడ్డేమిల్స్ రికార్డులను పరిశీలించారు.

23న పశువుల పరుగు పోటీలు

రామకుప్పం: మండలకేంద్రంలో బుధవారం పశువుల పరుగు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ స్థానిక గంగమ్మ ఆలయంలో పూజలు జరిపించిన అనంతరం పోటీలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

అయ్యప్ప దీక్ష విరమించిన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి


దీక్ష విరమిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం: శబరిమలై యాత్ర అనంతరం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఎర్రాతివారిపల్లెలో స్వగృహానికి చేరుకున్నారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో శనివారం దీక్ష విరమించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

చౌడేపల్లె: స్థానిక నేతాజీనగర్‌లో బైక్ చోరీపై బాధితుడు వేణుగోపాల్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. శుక్రవారం రాత్రి ఇంటి ముందు హోండా షైన్ మోటార్‌సైకిల్‌ను పార్క్ చేశాడు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకుండా పోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం


పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

రొంపిచెర్ల: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకున్న ఎంపీడీఓ రాజేంద్ర, బొమ్మయ్యగారిపల్లె కార్యదర్శి హరిబాబు, ఆరోగ్య కార్యకర్త గాయత్రిని శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, విజయశేఖర్, మదనమోహన్ రెడ్డి, నాగిరెడ్డి, ప్రకాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాలాజీ, శ్రీనాథనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్తులు

పెద్దపంజాణి: మండలంలోని కొత్త ముద్దేపల్లి ఎంపీపీ పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ప్రధానోపాధ్యాయని జ్యోతి, ఉపాధ్యాయుడు హరిప్రసాద్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 8 ఏళ్లుగా వారు అందించిన సేవలను గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, పీఎంసీ చైర్మన్ ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త రెడ్డెమ్మ, గ్రామస్తులు కృష్ణప్ప, శ్రీనివాసులు, నారాయణ, మూర్తి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో వర్షం

రొంపిచెర్ల: మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. పది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్న ప్రజలకు ఊరట కలిగింది. వేరుశనగ సాగు చేస్తున్న రైతుల్లో ఆనందం నింపింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజానీకం ఊపిరి పీల్చుకుంది.

సారా తయారీ స్థావరాలపై దాడి


రొంపిచెర్ల: నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల పంచాయతీ వంకిరెడ్డిగారిపల్లెకు సమీపంలో సారా తయారీ స్థావరాలపై శనివారం దాడి చేసి సిద్ధయ్య (55) అరెస్టును చేసినట్లు పులిచెర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. అతని నుంచి 10 లీటర్ల స్వాధీనం చేసుకుని, 40 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పీలేరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు అదేశించారని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ కనీశ్వర్‌నాయుడు, సిబ్బంది సుధాకర్, కృష్ణవేణి, మధు పాల్గొన్నారు.

బోధన ఉత్తమం

వసతులు ఉన్నతం..

పలమనేరు పట్టణంలోని శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్పొరేట్ కాలేజీలను మరపిస్తోంది. పదేళ్లుగా అడ్మిషన్లలో అత్యున్నత స్థానం దక్కించుకుంటోంది. ఈ ఏడాది సైతం జిల్లాలోనే ద్వితీయస్థానంలో నిలిచింది. ఉన్నత వసతులు.. ఉత్తమ విద్యాబోధనతో పిల్లలను దీటుగా నిలబెడుతోంది. ఇక్కడ అరుదైన గ్రూపులు అందుబాటులో ఉండడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారింది.

- ప్రైవేటుకు దీటుగా పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- అడ్మిషన్లలో జిల్లాలోనే రెండోస్థానం
- అందుబాటులో అరుదైన గ్రూపులు
- పూర్తిస్థాయిలో సహకరిస్తున్న సర్కారు


ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



పలమనేరు: పట్టణంలో 1983లో ప్రారంభమైన డిగ్రీ కళాశాల ఎందరి జీవితాలనో నిలబెట్టింది. ఇక్కడ చదువుకున్న వందలాది మంది ఇప్పుడు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. మండలంలోని కొలమాసనపల్లెకు చెందిన వర్ర చెన్నారెడ్డి ఈ కళాశాల కోసం సొంత స్థలం వితరణగా అందించారు. ప్రస్తుతం వీరి వారసులైన రత్నారెడ్డి, గంగిరెడ్డి సైతం కళాశాల అభివృద్ధి కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కళాశాల దినదినాభివృద్ధి చెందడంలో ప్రభుత్వం పాత్ర ఎక్కువగా ఉంది. కళాశాలకు నాక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిటిడేషన్ కౌన్సిల్)లో బీప్లస్ గ్రేడ్‌లో నిలిచింది. దీంతో ప్రభుత్వ నిధులతో పాటు యూజీసీ నిధులు సైతం మంజూరయ్యాయి. ఫలితంగా కళాశాల మరింతగా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ప్రస్తుతం కళాశాలలో 30కి పైగా తరగతి గదులు, అన్ని కోర్సులకు సంబంధించిన ల్యాబ్‌లు, జిమ్, రీడింగ్ రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ స్క్రీన్, సువిశాలమైన మైదానం, ఎన్‌సీసీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈ కళాశాలలో 1,224మంది వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు.


కంప్యూటర్ క్లాసులు


ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ


అత్యాధునిక జిమ్

పీజీ సైతం..

కళాశాలలో డిగ్రీ కోర్సులకు సంబంధించి మొత్తం 11 గ్రూపులున్నాయి. ఇందులో బీఏలో తెలుగుతో పాటు ఉర్దూ, బీకాంలో కంప్యూటర్స్‌తో పాటు బీబీఏ, బీఎస్సీలో అన్ని రకాల కోర్సులున్నాయి. అయితే ఎక్కువగా ఉపాధి అవకాశాలున్న బీఎస్సీ హార్టికల్చర్, సెరికల్చర్, డైరీ టెక్నాలజీ లాంటి అరుదైన కోర్సులున్నాయి. స్థానికంగా ఇలాంటి కోర్సులు ఉండడంతో ఇక్కడి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇక్కడ పీజీ సైతం అందుబాటులో ఉంది.


డిజిటల్ క్లాస్ రూమ్

సౌకర్యాలపై డెమో



కళాశాలలో ఉన్న సౌకర్యాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా చూపించాం. ఏటా ఫలితాలను చూడమన్నాం. నాణ్యమైన విద్య అందుతుందని భరోసా కల్పించాం. రూ.లక్షల్లో ఫీజులు కట్టి ప్రైవేట్ కళాశాలలో చదివించే కన్నా స్థానికంగా సకల వసతులతో ఉన్న మా కాలేజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించాం. దీంతో అడ్మిషన్లలో ముందంజలో ఉంటున్నాం.

–డాక్టర్ వెంకటేశులు, ప్రిన్సిపల్

ఈ కళాశాల ఓ బ్రాండ్..



జిల్లాలోనే పలమనేరు డిగ్రీ కళాశాలకు మంచి పేరుంది. ఇక్కడ ఉన్నట్టు విశాలమైన మైదానం ప్రైవేట్ కాలేజీల్లో ఉంటుందా. ఆహ్లాదకరమైన వాతావరణంలో సువిశాలమైన తరగతి గదులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అవసరమైన ల్యాబ్‌లు, లైబ్రరీలాంటి సౌకర్యాలున్నాయి. దీంతోపాటు ఏటా సాధిస్తున్న ఉత్తమ ఫలితాలే కళాశాల బ్రాండ్‌కు గీటురాయి.

– దినేష్, బీఎస్సీ థర్డ్ ఇయర్, ఎంఈసీఎస్

సమస్యల పరిష్కారానికే లోక్‌అదాలత్


సమావేశంలో న్యాయమూర్తులు కరుణకుమార్, వాసుదేవరావు, కార్తీక్, సింధు

పుంగనూరు: సమస్యల పరిష్కారానికే లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కరుణకుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సింధుతో కలసి న్యాయవాదులు, వివిధశాఖల అధికారులతో సమావేశమయ్యారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక బాలికల కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కరుణకుమార్ మాట్లాడుతూ అవగాహన లేమితో పలువురు సమస్యలను జఠిలం చేసుకుని కోర్టుల చుట్టూ తిరుగుతుంటారని తెలిపారు. ఇలాంటి వారిని చైతన్య పరచి ఇరుపార్టీలు లోక్‌అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారమైయ్యే కేసులకు అపీల్ ఉండదన్నారు. అలాగే బాల్యవివాహాలపై గ్రామీణ ప్రాంతాలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. సెప్టెంబర్ 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తాగునీటి సమస్య పరిష్కారం


బోరు డ్రిల్లింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

వి.కోట: వి.కోట ప్రభుత్వాస్పత్రిలో తాగు నీటి సమస్యను శాశ్వత పరిష్కారించినట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణంలోని సీహెచ్‌సీలో జెడ్పీ నిధులతో నూతనంగా బోరు వేయించారు. పుష్కలంగా నీరు పడడంతో ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం జెడ్పీ చైర్మన్ ఆస్పత్రి తనిఖీకి వచ్చినప్పుడు నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జెడ్పీ చైర్మన్ వెంటనే స్పందించారు. అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన బోరు వేయించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్ , ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ చైర్మన్ అమరనాథ్ పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు కాప్పల్లె వాసులు


తిరుమలకు బయలుదేరిన గ్రామస్తులు

పలమనేరు: మండలంలోని కాప్పల్లి పంచాయతీవాసులు శనివరాం తిరుమలకు కాలినడకన బయలుదేరారు. గ్రామంలోని ఏకాంత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఇంటికో మనిషి చొప్పున గోవిందనామస్మరణ చేస్తూ కొండకు బయలుదేరారు. సుమారు 120 కిలోమీటర్లు ప్రయాణించి సోమవారానికి తిరుమలకు చేరుకోనున్నట్టు శ్రీవారి భక్తుడు రవీంద్రారెడ్డి తెలిపారు. గత 17 ఏళ్లగా శ్రావణమాసంలో దాదాపు 250 మంది వరకు కలిసి కాలినడకన తిరుమలకు వెళుతున్నట్టు వెల్లడించారు.

22న మండల మీట్

రామకుప్పం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యం, వ్యవసాయం తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతి, సమస్యలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకహాజరుకావాలని సూచించారు.

రాజనాల బండలో ప్రత్యేక పూజలు


విశేషాలంకారంలో స్వామివారు

చౌడేపల్లె: రాజనాలబండలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసపు మొదటి శనివారపు పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా శ్రావణ మాసం చివరి శనివారం, ఆదివారం రోజున పదమూడు గ్రామాల ప్రజలు కలిసి ఉట్లోత్సవం, తిరణాల నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి సేవకు వచ్చిన ఎంపీపీ రామమూర్తి దంపతులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం


అన్నదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

పలమనేరు: పట్టణంలో శనివారం ఘనంగా ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీఎం సర్కిల్ వద్ద కెమెరాను కనిపెట్టిన లూయిస్ జాకసమండే దాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి వారు పూలమాల వేసి అన్నదానం చేపట్టారు. ఫొట్రోగ్రాఫర్ల అసోసియేషన్ తరపున పలువురు ఫొట్రోగ్రాఫర్లకు రూ.లక్ష చొప్పున విలువైన బీమా బాండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, డీసీసీ మాజీ అధ్యక్షులు సుధాకర్, శ్రీపురం సీతారామయ్య మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు సేవా కార్యక్రమాల్లోనూ పాలు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. మనసులో ఉన్న భావాలను కళ్ల ముందు చూపే ఫొటోలను కళాత్మకంగా తీసే ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సురేష్, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రాఘవ, సభ్యులు చందు, ధన, ప్రభాకర్‌రెడ్డి, హరికుమార్, గజేంద్ర, మునిరత్నం, పూర్ణచంద్ర, హైదరాబాద్ బాషా పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కించపరిస్తే సహించం


నిరసన తెలుపుతున్న హిందూ మత పరిరక్షణ కమిటీ సభ్యులు

పలమనేరు: హిందూ ధర్మాన్ని కించపరిస్తే సహించే ప్రసక్తే లేదని హిందూ మత పరిరక్షణ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. భగవద్గీతపై తప్పుడు ప్రచారం చేస్తూ నకిలీ గీతను విక్రయిస్తున్న ఉత్తరప్రదేశ్ వాసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శనివారం ఈమేరకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రెండ్రోజుల క్రితం యూపీకి చెందిన కృష్ణప్రసాద్, అక్షర్‌పటేల్ నకిలీ భగవద్గీత పుస్తకాలను అమ్ముతుండగా బసవన్నకట్టవీధిలో గుర్తించామన్నారు. వారిని పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించగా, విషయం తెలుసుకోకుండానే విడిచిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా యూపీకి చెందిన 50 మంది పలమనేరు, పుంగనూరు, వీకోట, కుప్పం ప్రాంతాల్లో తిరుగుతూ కేవలం రూ.30 లకే భగవద్గీతంటూ అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. అయితే అందులో హిందూమతాన్ని కించపరిచేలా ఉందని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మిలటరీ సిద్ధయ్య, శరవణ, గేట్‌బాబు, జగదీష్, తాతయ్య పాల్గొన్నారు.

పాల దిగుబడి పెంపుపై అవగాహన



మాట్లాడుతున్న పశు వైద్యాధికారి చందనప్రియ, చిన్నకొండామర్రిలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

చౌడేపల్లె: పాల దిగుబడి పెంపునకు తీసుకుకోవాల్సిన చర్యలపై పాడి రైతులకు పశువైద్యాధికారి పవన్‌కుమార్ అవగాహన కల్పించారు. శనివారం చిన్నకొండామర్రిలో లయన్స్‌క్లబ్ మదనపల్లె అభయ వారి సహకారంతో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 180 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. పిడుదుల నివారణకు బ్యూటాక్స్ పిచికారీ చేయించారు. గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న పశువులకు మందులు పంపిణీ చేశారు. ముద్దచర్మ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం పశువుల కోసం పౌష్టికహారం, మినరల్ మిక్చర్‌ను అందజేశారు. పచ్చిమేత, దాణా వాడకంతో పాల ఉత్పత్తులు పెంచుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దేశాయ్ జయదేవ్‌రెడ్డి, సునీల్, వైద్యసిబ్బంది గోవర్ధన్, ప్రతాప్‌రెడ్డి, హరిత, రెడ్డిప్రసాద్, మణికుమార్, బాలాజీ పాల్గొన్నారు.

బయ్యారెడ్డిపల్లెలో..

సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ బయ్యారెడ్డిగారిపల్లెలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి చందన ప్రియ మాట్లాడుతూ 72 పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు, 10 దూడలకు నట్టల నివారణకు మందులతోపాటు 12 ఆవుల గర్భకోశ సమస్యలకు చికిత్స అందించినట్లు వివరించారు. పాల దిగుబడి పెంపొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏహెచ్ఎ బలరాం, సిబ్బంది రామకృష్ణ, వెంకటరమణ, సురేంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే హవా




రమణప్ప, సుధాకర్, మనోజ్ కుమార్



వెంకటేష్, వేముల నరసింహులు


వి.కోట : డిక్లరేషన్ చూపుతున్న వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు

శాంతిపురం/ గుడుపల్లె/సోమల/వి.కోట/ గంగవరం/కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలో ఖాళీగా ఉన్న పంచాయతీ వార్డు సభ్యుల స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. దాదాపు అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలుపొందారు. వివరాలు..

- శాంతిపురం మండలంలోని కడపల్లి, మఠం పంచాయతీలోని రెండు వార్డులకు జరిగిన పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మఠంలో మొత్తం 200 ఓట్లు పోల్ కాగా వైఎస్సార్‌సీపీ బలపరచిన రమణప్పకు 127, టీడీపీ మద్దతుతో పోటీ చేసిన సిద్దేష్‌కు 71 ఓట్లు వచ్చాయి. రెండు చెల్లని ఓట్లు రాగా రమణప్పకు 56 ఓట్ల మెజారిటీ లభించింది. కడపల్లిలో 246 ఓట్లు పోల్ కాగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసిన సుధాకర్‌కు 140, టీడీపీ బలపరచిన ప్రకాష్‌కు 103 ఓట్లు వచ్చాయి. నోటాకు 1, చెల్లనివి రెండు ఓట్లు కాగా సుధాకర్‌కు 37 ఓట్ల మెజారిటీ వచ్చింది.
- గుడుపల్లె మండలంలోని పెద్దబదినవాడ పంచాయతీలోని రెండు వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. పెద్దబదినవాడలో ఓ వార్డు సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో వార్డులో 254 ఓట్లకుగాను 221 ఓట్లు పోల్ కాగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు చంద్రప్పకు 77 ఓట్లు, టీడీపీ బలపరచిన అభ్యర్థి మంజునాథ్‌కు 143 ఓట్లు వచ్చాయి.
- సోమల మండలంలోని కందూరు పంచాయతీలో ఒక వార్డు మెంబర్ స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి చింతలపల్లె మనోజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- వి.కోట మండలంలోని పడిగెలకుప్పంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు వరలక్ష్మి 122 మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 545 ఓట్లకుగాను 472 ఓట్లు పోలింగ్ అయ్యాయి. అందులో వరలక్ష్మికి 296 ఓట్లు, మరో అభ్యర్థి సుజాతకి 174 ఓట్లు వచ్చాయి.
- గంగవరం మండలంలోని చౌడిరెడ్డిపల్లె పంచాయతీ బత్తనపల్లెలో వార్డు సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- పలమనేరు నియోజకవర్గంలో నిర్వహించిన పంచాయతీల వార్డు సభ్యుల ఎన్నికల్లో అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే వార్డు సభ్యులుగా ఎన్నికకయ్యారు. బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లె, గొనితిమ్మేపల్లె, పలమనేరు మండలం కరిడిమొడుగు, గంగవరం మండలం చౌడిరెడ్డిపల్లె వార్డుల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే ఏకగ్రీవంగా గెలుపొందారు. వి.కోట మండలంలోని కొంగాటం పంచాయతీలోని ఓ వార్డుకు శజరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు విజయం సాధించాడు. పెద్దపంజాణి మండలం పెద్దారికుంట పంచాయతీలోని ఓ వార్డుకు ఎస్టీ రిజర్వుడు అభ్యర్థులు లేక ఎన్నిక జరగలేదు. మొత్తం మీద ఏడు వార్డులను వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకుంది.
- చౌడేపల్లి మండలంలోని పుదిపట్ల పంచాయతీ వార్డు మెంబర్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వేముల నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పెద్దతండాలో సీసీ రోడ్డు నిర్మాణం


సీసీ రోడ్డు వేయిస్తున్న సర్పంచ్ మోహన్ నాయక్

రామకుప్పం: మండలంలోని పెద్దతండా పంచాయతీ పరిధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకారం చుట్టారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్సీ భరత్ పెద్దతండాలో పర్యటించినప్పుడు స్థానికులు సిమెంటు రోడ్డు వేయించాలని విన్నవించారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్సీ భరత్, సర్పంచ్ మోహన్ నాయక్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.